# బాగుపడ్డారు

జేబులు కొట్టేసి – దొరికిపోయిన నేరానికి జెయిల్లోవేసిన జోగుల్ని సర్కారువారు విడుదలచేసేరు. 'బాగా బతుకు, ఎదవపన్లు సెయిమోక' అంటూ సలహా చెప్పేడు– జైలు గేటుదాకా జోగుల్ని సాగనంపిన కానిస్టేబు'.

'ఆడు సెప్పేదేటి గాని, ఇకమీదట జాగ్రత్తగా బతకాల! బాగుపడాల! పెళ్ళాం బిడ్డల్తో కల్సి సుఖంగా ఉండాల! ఈ జేబులు కొట్టడం, బోకరేజి చేయడం, ఫీ– ఆ అప్పిగాడి మూలాన అలవాటైనాది గాని–ఛ!...' ఇంటిముఖం పట్టిన జోగులు బాగుపడే మార్గాలను గురించి ఆలోచించసాగాడు.

'ఔనాను! బాగుపడాలంటే సదూకోవాల. ఛస్, సదూకున్నోడెవడు బాగుపడ్డాడీ రోజుల్లో? ఆడు సోగ్గానూ తకలేడు, అడుక్కునీ తిన్లేడు. అంతేత దివి బాగుపడ్డావనుకోడం యెర్రితనం. ఏరేటి సేయాలి. బిజినెస్, బిజినెస్! డికీ ఈడికీ ముడెట్టడం. [ఆడదాన్ని ముగాడికి తార్చడం.] ఈడి దగ్గిర బేడ కొని, ఆడికి బ్లేకులో ముప్పావలా మ్మడం; హైక్లాసు అయ్యగార్లకు 'కంపినీ సా'లో నాటుసారా నింపి 'షిప్పుమీది రుకు సార్' అంటూ అంటగట్టేయడం; రా' బోర్డెట్టి 'నాటుసారా' యాపారం య్యిడం – ఈటిలో ఏది సేసుకు బతక ం? ఛెస్, ఇలాటి యాపారం సెయ్యిడం తనకు పరమ అసయ్యం. హాయిగా బతకాల. ఈధిలోంచి యెడ్తుంటే జనాలంతా చెయ్యెత్తి నమస్కారాలు పెట్టాల. ఇంటి కెళ్ళగానే పెళ్ళాం – 'యేవండీ, వొడ్డించీమంటారా?' అనడగాల. కూతురు 'నాన్నా సినేమా కెప్పుడెడదాం?' అని సిగ్గుపడుతూ సొరవగా అడగాల. అంతేగాని 'వొచ్చిండు, సచ్చినోడు– ఈయేళ యెవడి నోటికాడిది యెత్తుకొచ్చిసిండో!' అని పొద్దుగూకులా సివాట్లుతినే యెదబ్బతుకు బతకక్కాడదు.

ఆలోచించుకుంటూ ముందుకు సాగుతున్న జోగులికి పెళ్ళాం, కూతురూ జ్ఞప్తికొచ్చేసరికి కళ్ళల్లో నీరు తిరిగింది. 'తన పెళ్ళం – నర్సయ్యమ్మ – ఏటి సేస్తందో, యేటో! ఏడ్నెల్లు–గడిసిపోయినయ్ గాని, అదెన్నాళ్ళు పస్తులుందో యేటో! కూతురు కనకం – పద్దెమ్మిదేళ్ళముండ – దాని కొంటిమీద సరిగ్గా గుడ్డముక్కైనా అమిరిందో లేదో. అయ్యో భగవొంతుడా, జెయిల్లో ఏదో నాకు నాలుగు మెతుకులు పెట్టించేవ్; నా పెళ్ళానికీ, బిడ్డకీ ఈ ఏడునెల్లూ గంజైనా పోసేవో లేదో – అంతా నా రాత దేవుడా, నా రాత!'

జోగులికి 'మంచిదనం' మీదకు మనసు మళ్ళింది. 'మంచి మనిషి' లా బతకాలన్న కోర్కె బలీయమైంది. మంచిదనపు సోపానాల గురించి మళ్ళీ ఆలోచన ప్రారంభించాడు.

'ఔను, బాగుపడాలంటే ఎన్ని మార్గాలేవు! తనుంటున్న యీదిలో నల్లకోమటి తన కళ్ళెదురుగ్గా ఎలా బాగుపడగల్గేడు! పదేళ్ళకిందట బడ్డీకొట్టు పెట్టి అరటిపళ్లు అమ్మేడు. ఆనక అగ్గిపెట్లమ్మేడు. మూడు గుర్రాలబీడీ లమ్మేడు. చార్మినారు సిగరెట్లమ్మేడు. కొత్తలో నూక లమ్మేడు తర్వాత తవుడూ చిట్టూ జోడీచేసేడు. కుర్రాణ్ని పెట్టి కాయితాలు కొనిపించి, సంచీలు కట్టి, అయ్యి అమ్మేడు. మెల్లమెల్లగా పెద్దమార్కెట్టునుంచి చింతపండు అరువుకు తెచ్చి, రూపాయికి బేడ లాభమేసుకుని, ఆ లాభంతో బెల్లం, పంచదార సంపాదించి, బడ్డీని మంగలిసాపుకి అద్దికిచ్చి, తనో అరుగుమీద కిరాణాకొట్టు ఆరంభించేడు. అంతే, ఆ దదురుష్టం పండింది; పట్టిందల్లా బంగారమైకూచుంది. దాంతో ఆ సందు ముంగిట్లోని ముసిలి చాకలాడి పడుచుపెళ్ళాం యీడిమీద కన్నేసిందో, యీడు దానిమీదే కన్నేసేడో, యిద్దరికీ 'భేటీ' కుదిరేలోగా ముసిలోడు మూలక్కూండా చావడం, ఆడు కూడబెట్టిన డబ్బంతా పడుచు పెళ్ళాన్కి రావడం, దాన్ని ఈడిదగ్గిర యాపారానికి అదిమదుపెట్టడం–ఓహో, ఒకటేవిటి, గీత ఉండాల యెవడికైనా! ఆడు యీనాడు మేడలమీద మేడల్లేపేస్తున్నాడు. రేపు కారు కొంటాడు. ఎల్లుండి ఎలక్షన్లో నుంచుంటాడు. ఆనక

మినిష్ట రైపోతాడు. అయిపోయినా ఆశ్చర్యపడిపో నక్కర్లా—అంతా రాసి పెట్టుండాల! పక్కయీాదిలో భూలోకంగా డేటి చేసేడు? 'అణా లైబ్బురరీ' పెట్టి, 'డిటెక్టివ్ బుక్కులు' అద్దికిచ్చి, వొందల కొందలు గడించేడు. ఇప్పుడు డాబా లేపుతున్నాడు. మొన్న కౌన్సిలేరుకు నుంచుంటా నన్నాడు. మార్కెట్టులో సుబ్బరాజో—బూతుబుక్కులు అచ్చేయించి వేలకువేలు దోచేసుకున్నాడు. మొన్న కూతురికీ హైస్కూలు మేష్టర్నిచ్చి పెళ్ళి చేసేడు. చెల్లెలికి సమ్మంధం కుదిర్చి అట్టే పెట్టేడు. బూతుకథల బుక్కులు నెలనెలా అచ్చేయిస్తూనే ఉన్నాడు. ఆడు సేసింది 'తప్పు' అని ఎవరనగలడు? బూతుపుస్తకం అచ్చేయ్యడం ఆడిదె తప్పైతే, డబ్బెట్టి కొని, సదివి ఆనందించే స్టూడెంటు కుర్రాళ్ళ దెంత పెద్దతప్పు? ఆ డెవడికీ హాని సెయ్యడంలే! ఆడి కాళ్ళమీద ఆడు ఆనందంగా బతుకుతున్నాడు. ఆ యాపారంలో ఆడికి చుక్క నప్పింది; ఆకాసాని కేసి ఎగిరిపోతన్నాడు! అది ఆడి అదురుష్టం!

అవును, బాగుపడాల! తనలాటి సిన్నోళ్ళూ, సితకోళ్ళూ బాగుపడిపోతే గొప్పోళ్ళకి యూతనే ఉండబోదు. తనలాటోళ్ళు అన్నేయాలు సెయ్యడం మానేస్తే. ఆఫీసరు బాబులు అన్నేయాలు సెయ్యడానికి అవకాశం ఉండదింక. తనలాటోళ్ళ మూలంగా పెద్దోళ్ళు బాగుపడ్తారు. పెద్దోళ్ళు బాగుపడితే ప్రెభుత్వం బాగుపడద్ది. అది బాగైతే దేశం బాగవుద్ది. అప్పుడు మనం ఇప్పుడులా పొరుగు దేశాల్లోని దొరబాబు దగ్గర పాలపిండికీ, గోధుంపిండికీ పిడికిలి చాచనక్కర్లేదు. మనదేశంలో పిల్లలంతా దొరబాబులు పంపిన 'రేకుడబ్బాల్లోని పాల'కు బదులు ఆళ్ళ అమ్మదగ్గిరపాలే తాగి తెలివైన వాళ్ళవ్వుతారు. ఈ 'డబ్బాపాల తెలివి తేటల' మూలంగానే గాంవోసు—మన దేశమిలా అఘోరిస్తోంది. అవునుమరి — దేశం మట్టుకు ఏటి సెయ్యగలదు? జనాల్ని బాగుసెయ్యాలనే దాని ఉద్దేశికం. అందర్నీ బాగుసెయ్యకపోయినా కొందరైనా బాగుసెయ్యాలని దేశాన్ని పరిపాలించే ప్రెభుత్వంవోరి ఉద్దేశికం.

అందుకే ప్రెభుత్వంకూడ 'ఎలా బాగుపడాల?' అని అస్తమానం ఆలోసించి. కొన్నికొన్ని 'సిటాక్క' లేసి గమ్మత్తులు సేస్తంది. యెలతున్న ముందురోజుల్లో 'మీ జీతాలు పెంచేవోం' అని అందరిసేతా ఓట్లేయించుకొంది ఓట్లేయించుకునెగ్గింది. నెగ్గగానే 'మీలో మూడొంతుల మందిని వుజ్జోగాల్లోంచి పీకేస్తన్నామో' అంది, అంతే—ఏటి సేస్తారు? 'అయిదేళ్లెప్పుడు గడిసిపోతయ్యా' అని ఎదురుసూస్తూ కూచుంటారు. ఈలోగా జీవాలుంటే సరే. లేప్పోతే, జీవం పోయినోడంతటి అదురుష్టవొంతుడు మరొకడుండడు. అదీగాక — ఎంతో మందిని వుజ్జోగాల్లోంచి పీకేస్తే, ప్రెభుత్వానికి లాభ మెలాగొస్తది? పీకేసినోళ్ళ జీతం డబ్బులు ఉన్నోళ్ళకి అందిచ్చడమేనా.



జీతాలు పెంచడం అంటే? కల్లో గెంజో తాగుతున్నావోడి నోటి దగ్గిరిది లాక్కెళ్ళి పరవాన్నం తినేవోడి కంచంలో రాల్చడమేనా? పోనీ కుర్రవుజ్జోగస్థుల్ని పీకేసేరే అనుకుందాం. పెళ్లాం బిడ్డలతో కనాకష్టంగా బతుకులీడుస్తున్న 'బతకలేని బడిపంతుళ్ళని' ఆళ్ళ వొయస్సులు మళ్ళిపోయే రోజుల్లో పీకిపారేస్తే-ఆ అయ్యలు బతుకులీడ్సడం యెల్లా?

యేటో బాబూ! అంతా మాయలా గుండాది!

ఇలా సెయ్యడం మూలంగా యెలా బాగుపడద్దో దేశం-మనబోటి సదూకోనోడికి యేటి తెలుస్తది? ఒకడి ఉసురు తగిత్తేనే పకోడ్కడు బాగుపడలేడు కదా, యింతమంది ఘోల్లున యేడుస్తుంటే! ఆళ్ళ 'ఉసురు' ఎక్కడికి పోద్ది? దేశం ఎలా బాగుపడద్ది? ప్రెభుత్వంలో పెద్దలియ్యన్ని ఆలోసించేరో, లేదో? ఆ రేది ఆలోసించినా మంచికే ఆలోసిస్తారంటారు, మరిది ఎట్టాంటి మంచో?

...ప్రెభుత్వం 'ఊసి' తసెకెందుగ్గాని, ఇప్పుడు తనెలా బాగుపడాల? యెలా మంచిగా బతకాల? కూలిపనైనా సేసి కూడబెట్టాల! లేపోతే ఎవడైనా మదుపు పెడితే యాపారం సెయ్యాల. పకోడీల డ్డీ పెట్టి రామన్నతాత ఎంత కూడబెట్ట లేదు. ఆనక ఆడి కొడుకు నరసింవం ఏం సేసేడు? ఆ కొట్టుమీద వయసొచ్చిన కూతుర్ని కూచోబెట్టేడు; అంతే. కాలే లో సదివే కుర్రోళ్ళంతా కొట్టులో ఖాతాలు పెట్టేసీరు. నెల తిరిగేసరికి ఆడ కూతురు 'ఏటి అబ్బాయిగోరూ! డబ్బు స్తారా, కిందట్నెల పన్నెండు, తంవరిది దిహేను,' అనడగడం, అబ్బాయిగోర్లు బ్బులు వర్షం కురిపించేయడం-ఒకటా-రసింవం తక్కువోడా, యాపారం వు అవడాన్కి ఆడికి తోచిన ఉపాయం ది! అనుకొంటున్న జోగులకి బుర్రలో రుపు మెరసినట్లయింది. అనుకోకుండా డుగులు జోరుగా పడసాగినయ్. ఒక్క రిగా మనిషిలో ఉత్సాహం ఉరకలు సింది. అవును, తనూ అలాగే ఎందుకు యకూడదు? కాలేజీ ఎదురుగా కిళ్ళీ డ్డీ పెట్టాల! సిగరెట్లు జేర్చాల! అంటి గెలతు తగిలించాల. రంగుబుడ్లూ, సోడాకాయలూ అమ్మాల! ఇయ్యన్నీ అమ్మడానికీ, యాపారం గిరాకీ పెరగడానికీ కొట్టుమీద కనకాన్ని కూసోబెట్టాల! అవును, అందులో తప్పేటి? ఎంతమంది పెద్దింటి ఆడమనుసులు ఉజ్జోగాలు సెయ్యడం లేదూ? ఎంత మంది హైస్కూలు ఆడమనుసులు మొగాళ్ళతో కల్సి పనులు సేసుకోడం లేమా? యాపారం సెయ్యడం కూడా ఓ ఉజ్జోగమే. ఒకడికింద తలొంచి పంజేసే కంటె సొతంత్రంగా యాపారం సేసుకోడమే మెరుగు ఇదీ ఒకరకమైన బతుకు తెరువే! ఇందులో తప్పేటి? ఏలెత్తి సూపే అవుసగం ఎవడి కుంటాది? కనకాలు కొట్టుమీద కూసుంటది. కుర్రోళ్ళు యీగళ్ళా ముసురుతారు. అందులో ఆళ్ళ తప్పూ లేదు. ఆడదాన్ని సూస్తే ఆకలేయడం ఒయసులోవున్న కుర్రాడికి సహజం. కనకాన్ని సూద్దామని ఒచ్చినోళ్ళంతా ఓ అంటిపండో, సిగరెట్టో, సోడావో కొనకమానరు. పక్కన పాత బడ్డీ లున్నా కొత్తబడ్డీలో 'గుంట' కూసుందని తప్పకుండా ఒచ్చితీర్తారు. కాపోతే కుర్రాళ్ళు యెద వేసకాలు ఎయ్యకుండా తను జాగర్తపడాల! యెవడేనా ఆసికాలాడితే కనకంచేతనే సిన్నంగా సివాట్లు పెట్టించాల. అలా యాపారంలో లాభంచేసి, కనకాన్నొకింటిదాన్ని చెయ్యాల. కొట్టు బాగా అభిరుద్ధిలో కొస్తే-ఎవడైనా ఒస్తాడు కానకాల్ని చేసుకుందుకు. దానికేం వొయసు లేదా, అందం లేదా? సరైన చీరా, రయికా తొడిగితే ఈ సాయిత్తుర్లూ, జెమున్లూ దానిముందు ఎందుకూ పనికిరారు. సినేమాలు తీసేవోడెవడైనా కిళ్ళీ బడ్డీమీద కనకాల్ని చూసేడంటే కార్లో ఎక్కించుకు చక్కా పోగల్డు! తన కూతురు అందం గురించి ఎవడు ఏలెత్తి చూపెట్టగల్డు? పాపం-కనకాలు ఎలాగుందో ఏటో?"

గబగబా నడుచుకుంటూ 'స్టార్టయిపోయిన బస్సెక్కేడు జోగులు. టిక్కెట్టు కొని కండక్టరు పక్కసీటులో కూర్చున్నాడు. జోగుల్ని కండక్టరు అధోలా వికారంగా చూసేడు. 'యెదవ, ఈడికి నేనింకా గుర్తున్నాను!' మనసులోనే అనుకున్నాడు జోగులు. 'అవును, ఓసారి నాటు బిగించేసి ఈడి బస్సెక్కితే పోలీసోడికి వొప్పగించీసేడు ఈడే! దొంగ సచ్చినోడు. అదే ఆనమాలు ఈడికి. చూస్తావుంద్రా-మళ్ళీ నీ బస్సెక్కేప్పటికి యెల్లాగుంటానో! సెయ్యెత్తి దండంపెట్టి, 'రండిబాబూ, రండి' అంటావ్. హూఁ, మనిసి వొక్కసారి తప్పుచేస్తే ఆణ్ని బతికినన్నాళ్ళూ యెలేసేస్తారు యెదవజనాలు! ఈడు తప్పుచేసేడు, ఈణ్ని బాగుచేద్దాం-అనే బుద్దెవడికీ లేదు. బాగుపడాలనుకొన్నోడికి సాయం చేయడంలేదు. పైగా ఆణ్ని దెప్పిపొడవటం. ఏం మనుసులో, ఏం లోకమో! ఛీఛీ!..'

మనసులో ఆలోచనలు తెరలు తెరలుగా కమ్ముకొంటున్నయ్. 'సారా తాగడం మానీయాల పూర్తిగా. ఈ ఏడునెల్లూ ఎలాగా మానీసేడు గనక ఇక ముందు కూడా మానీయాల. అది మానేస్తే తన పెళ్ళాని కెంతో సంతోషం. డబ్బు తేపోయినా ఏఁవీ అనదుగానీ, సారా తాగెడితే తంతది. తాగుడు కెట్టే డబ్బుతో కనకాలి మెళ్ళోకి కాసు బంగారం కొనాల! అదెట్టుకుని అది కొట్టుమీద కూకుంటే 'ఏ యాఫీసరుబాబు కూతురో' అని జనాలు బుగ్గన వేలేసుకోవాల! అప్పుడు అందరూ 'అది జోగులుగాడి కూతురు కనకంరా' అని చెప్పుకుంటుంటే, తనకింకేటి గావాలి? దానికో చక్కటి మొగుడు దొరికితే, ఇంక తనెలాపోయినా వొకటే!' కూతురి మీదా, పెళ్ళాంమీదా బంగారు కలలు కంటూ కునుకుతీసాడు-కుదుపుతో వెడుతున్న బస్సులోని పాతకేడీ జోగులు!

* * *

'వోయ్, లెగవయ్యోయ్, లెగులెగు!' కండక్టరు లేపేదాకా జోగులికి మెలకువ రాలేదు.

'టైమెంతయింది బాబూ!' వినయంగా అడిగాడు జోగులు-జోగుతూనే.

'చీకటడిపోయింది, ఆరున్నర దాటింది, ఏం, అర్జెంటు పనేటి?'-అదోలా కృత్రిమంగా, వ్యంగ్యంగా నవ్వుతూ అడిగాడు డ్రైవరు తాతారావు.

ఉలిక్కిపడి లేచి, ఒక్కసారి వళ్ళు

విరుచుకొని, కంగారుగా ఇంటివైపు బయల్దేరాడు. 'ఇంట్లో నర్సయ్యమ్మ దీపం వెలిగించిందో, లేదో! దీపం యెలిగించడానికి కిరసనా లుందో లేదో!' ఎళ్ళగానే 'యింకెప్పుడూ యెదవపన్లు చెయ్యననీ, తాగుడు మానేస్తాననీ' సత్తెప్రెమాణకంగా నర్సియమ్మకు ఒట్టేసి చెప్పాల. అప్పుడు నర్సియమ్మ నవ్వింది దాని కళ్ళల్లో వెయ్యిదీపా లెలుగుతయ్. 'నిజంగానా నాన్నా' అన్నట్టు కనకాలు ఆచ్చెర్యపోద్ది. ఎంత నేరం చేసినా నర్సియ్యమ్మకు మొగుణ్ణేగదా, కనకాలుకు 'కని పెంచిన అయ్య'నే కదా. ఆళ్ళకు మట్టుకు ఆనంద మేయదూ?'

—పక్కనే కనబడ్డ కిళ్ళీకొట్టు దగ్గర బీడీ ముట్టించుకున్నాడు జోగులు. కొట్టు మీద కూచున్న ఆడమనిషి జోగులు వెంపు అదోలా, అసహ్యంగా చూసింది. 'చెస్, సీతో నాకేటే' అనుకొని ముందుకు నడిచాడు జోగులు.

ఉరకలు వేస్తున్న ఉత్సాహాన్ని అదుపులోకి తెచ్చుకొంటూ, 'మంచి' అనే అంతస్థుకు తను చేరుకోవాలనీ, కట్టుకొన్న పెళ్ళాన్నీ, కని పెంచిన కూతుర్నీ జేర్చాలనీ ఉబలాటపడుతూ, ఇంటి సందు మలుపు తిరిగాడు జోగులు.

ఒకటి, రెండు, మూడు...పది... పదిహేను-అంగల్లో గుమ్మం దగ్గరకు జేరుకొన్న జోగులు ఆనందంతో ఒక్కసారి ఆగిపోయాడు.

'అలాకాదు, గమ్మత్తుగా వెళ్ళి నర్సియ్యమ్మకు ఒక్కపళంగా కనబడాల!' అనుకుంటూ మెల్లగా తలుపు లోపలికి తోశాడు. బల్లమీద గుడ్డిగా వెలుగుతోంది దీపపుబుడ్డి. ఆ వెలుగులోనే, వీపును గుమ్మంవైపు పెట్టి, భోంచేస్తున్న నర్సియ్యమ్మకు-వెనకగా, మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళి, ఒక్కసారి ఆమె కళ్ళు మూశాడు జోగులు. 'అబ్బ, యేటీ మోటసరసాలు, ఒగ్గేయ్! విదిలించుకొంటున్న కంఠంలోని కొత్తదనానికి ఆశ్చర్యపడి, ఆమె కళ్ళమీది నుండి చేతులు తీసి, ముందుకు వెళ్ళబోయిన జోగులు, 'కెవ్వు' మన్న ఆమె 'కేక' విని కొయ్యబారిపోయాడు. కారణం-ఆమె తన 'నర్సియ్యమ్మ' కాదు!



"దొంగసచ్చినోడా, యెవడ్రా నువ్వు?"

భయంతో గజగజ వణికిపోతూ, ఒక్క అంగలో వెనక్కువచ్చి నిల్చుండిపోయాడు జోగులు. తర్వాత తమాయించుకొని, ధైర్యం కూడగట్టుకుని, చేతులు జోడించి, అపులేకుండా తిట్టిపోస్తున్న ఆమె కంఠానికి అడ్డుపడ్తున్నట్టుగా-"ఈ ఇల్లు నాదమ్మా, ఈ యిల్లు నాదీ; అంచేత వొచ్చేను. నేను...నేను జోగుల్ని!" అన్నాడు వణికిపోతూ.

ఠక్కున ఆమె ఆగిపోయింది! చిత్రంగా అతని వెంపు చూసింది.

ఇంతలో ఆమె కేకలు విని గామోసు, అక్కడికొచ్చి జేరిన నల్గురైదుగురూ జోగులివంక ఆశ్చర్యంగా చూస్తూ నిల్చుండిపోయారు.

ఎవడో మొదలెట్టాడు—"ఒరేయ్, ఇదింక నీ యిల్లు కాదురా! మీ యావిడ ఎవడితోనో ఎల్లిపోతూ అమ్మేసినాది. నీ కూతురు కనకాలు యిస్కూలు



మేష్టరుతో లేచిపోనాది. ఆడు, దాన్ని సహించుకుంటాడల్లే, నువ్వెళ్ళి జేబులు కొట్టుకో—"

"పోరా, కేటునాయాల, ఇంకా సూస్తావేటి ?"

"హోరి ! జోగులుగాడా ! జైల్లోంచి పారిపోయి వొచ్చిసినావేట్రా? యెదవ!" మెడపట్టుకు గెంటేడు జోగుల్ని–వచ్చినాళ్ళల్లో బలంగావున్న ఒకడు.

నీరసంగా మూలుగుతూ, నిస్పృహాయంగా చూస్తూ, సిగ్గుతో కుంచించుకుపోతూ, వెనక్కు తిరిగి, నడక ప్రారంభించాడు జోగులు–అన్ని కష్టాల్లోనూ, అందర్నీ ఆదుకొని, ఆప్యాయంగా ఆహ్వానించి, కష్టాల్ని మరపింపజేసే 'కల్లుపాక' దగ్గిరకి. ఒకటీ, రెండూ, మూడూ,..ఏడు.. 'కల్లుగళాసు' లను అందుకుంటూనే ఉన్నాడు జోగులు.